# అమ్మయ్య... ఉద్యోగం దొరికింది!

"పట్నంలో మామయ్య రాజకీయాల్లో తిరుగుతున్నాడు. ప్రస్తుతం మంచి సర్కిల్‌లో వున్నాడు. అక్కడ పదిరోజులుండి వెంటపడితే- వీలైతే ఎవరితోనైనా చెప్పించి ఏదో ఒక ఉద్యోగం ఇప్పించకపోడు!" అని మా నాన్నగారు కోరుతుంటే మామయ్య దగ్గరకొచ్చాను.

నన్ను చూస్తూనే మామయ్య- "ఏరా... అంతా బాగున్నారా? వారంరోజుల్లో మన నియోజకవర్గం మంత్రిగారు ఇటువైపు వస్తున్నారు. ఆయనతో చెప్పి నీకేదైనా పని చూద్దాంలే... ప్రస్తుతానికి నా దగ్గరవుండు! బి.ఇడి. రాశావుగా... ఏమైంది?" అన్నాడు.

"బి.ఇడి. ఎంట్రన్స్ మళ్లీ రాయలి మామయ్యా! ఒకసారి రాశాను గానీ, రాలేదు!" అన్నాను.

"మంత్రిగారి మీటింగ్‌కి ఏర్పాట్లు చేయాలి. అలా వెళ్లివద్దాం... పద!" అంటూ మామయ్య నా జవాబు కోసం ఎదురుచూడకుండా జీపు ఎక్కాడు. మామయ్యకి ఎస్కార్ట్‌గా ఇద్దరు బలిష్టమైన మనుషులు కూడా ఎక్కారు. నేనూ వెనకాలే ఎక్కాను.

నగరం దాటి కొండల్లోకి- చిన్న ఊరులా వుంది... అక్కడకు వెళ్లాం. మామయ్యకేమైనా 'అన్నల'తో సంబంధం ఉందేమోనని భయమేసింది. ఒకచోట జీపు ఆపి, "ఇక్కడ జనాన్ని సప్లయ్ చేసే ఆఫీసు వుండాలి... ఎక్కడికి మార్చారు?" అని అడిగాడు.

"ఇంకొంచెం ముందుకువెళ్లి ఎడమవైపు తిరగండి. అక్కడ పెద్ద లోగిలి వుంటుంది!" అన్నాడొకతను.

'పెళ్ళిళ్ళకు, శుభకార్యాలకు షామియానాలు, కుర్చీలు, వంట సామాన్లు సప్లయ్ చేసే వ్యాపారం విన్నాను, చూశాను. కానీ, ఇదేమిటి?' అనుకున్నాను.

అతను చెప్పినట్లుగానే ముందుకెళ్లాం. అక్కడ ఒక పెద్ద దివాణం వుంది. చుట్టూ కోటగోడల్లా గోడలు వున్నాయి. ఎత్తైన గేటు వుంది.

మా జీపు ఆగగానే గేటు తీశాడు గూర్ఖావాడు. దుబ్బుమీసాలతో దుర్మార్గంగా వున్నాడు. లోపల దివాణం ముందు పెద్ద అరుగులు వున్నాయి.

ఒక అరుగుమీద బాణాకర్రలు పట్టుకుని కొంతమంది నిలబడివున్నారు. మరో అరుగుమీద ఒక సింహాసనంలాంటి చెక్కకుర్చీలో ఒక వ్యక్తి కూర్చునివున్నాడు.

అతను సుమారు ఆరు అడుగులు ఎత్తు, కావిరంగు బనీను, పంచెతో వున్నాడు. మెడలో నులకతాడు లాంటి బంగారం గొలుసు, నోట్లో పొడుగాటి లంక పుగాకు చుట్ట,

ఎత్తుకు తగ్గట్లుగా మనిషి లావుగా, పుష్టిగా వున్నాడు. సినిమాల్లో ముంబయి నుంచి దిగుమతి చేసిన విలన్‌లా వున్నాడు.

మా జీపు ఆగగానే బాణాకర్రలు పట్టుకున్నవాళ్ళు కొంతమంది చకచకా మా దగ్గరకు వచ్చేశారు. నాకు వాళ్ళ ముఖాలు చూస్తే భయం వేసింది. ఉన్న పళంగా పారిపోవాలని పించింది. ఎందుకంటే, వాళ్ళు మమ్మల్ని చితకబాదేసే మూడ్‌లో వున్నారు.

'జీపు దిగి పారిపోతే బతికుంటే పల్లీలమ్ముకుని బతకొచ్చు!' అనుకున్నాను.

"మేము జనం కోసం వచ్చాం!" అని మామయ్య అనగానే, వాళ్ళ ముఖాల్లో తాయిలం చూపించిన పిల్లాడి ముఖంలో సంతోషం కనిపించింది.

"రండి సార్... రండి!" అంటూ లోపలకు వెళ్లి రెండు కుర్చీలు తీసుకువచ్చి వేశారు.

"నమస్తే సార్! చాలాకాలమైంది మిమ్మల్ని కలిసి!" అన్నాడు కుర్చీలో కూర్చున్నవ్యక్తి.

"ఈమధ్యన రాజకీయంగా మీటింగులు జరగడం లేదు. అధికారంలోకి వచ్చిన పార్టీ బలంగా ఉన్నన్నాళ్లూ జనం గుర్తుకురారు కదా! ఈమధ్య పార్టీలో లుకలుకలు బయలు దేరాయి. అందుకే జనం గుర్తొచ్చారు. మంత్రి గారొస్తున్నారు. సభలో జనం బాగా వుండాలని పైనుండి ఆర్డర్సు వచ్చాయి!" అన్నాడు మామయ్య.

"అదిసరే సారూ... ఎన్ని లారీల జనం కావాలి?"

"పోయినసారి పది లారీల జనాన్ని పంపించారు. ఈసారి కనీసం ముప్ఫయ్ లారీల జనం కావాలి!"

"మరీ..." అంటూ నసుగుతున్నాడతను. "పోయినసారి రేటు గిట్టుబాటు కాదండీ... ఖర్చులూ, అవీ బాగా పెరిగిపోయాయి. జనం తెలివిమీరిపోయారు."

"అలాగలాగే! అవసరం మాది... చెప్పండి!"

"పోయినసారి లారీకి పాతికవేలు ఇచ్చారు. ఈసారీ... సరేలే... ముందు ఒక లక్ష రూపాయలు బయానా ఇప్పించండి. తరువాత చూద్దాం!" అన్నాడు.

ఇంతలో... అతని సెల్ మోగింది.

"హలో... జనం కావాలా? ఎంతమంది కావాలి? ముప్ఫయ్ లారీలా? ఏ రోజు క్కావాలి? పంపించండి మనిషిని. ఇప్పుడే ముప్ఫయ్ లారీల జనానికి బేరం మాట్లాడుతున్నాను. రేటు కుదిరితేనే పంపగల్ను!" అన్నాడు.

అతని మాటలకు అడ్డువచ్చి "బాబూ ఎవరికీ చెప్పకండి. నేను ఇంకో ఏభైవేలు ఇస్తాన్లే!" అన్నాడు మామయ్య.

"సర్లెండి..." అన్నాడతను మీసాలు దువ్వుకుంటూ. ఆ ఫోను అతని ఇంట్లోంచే ఒకడు చేశాడన్న సంగతి ఎవరికీ తెలియదని అనుకుంటున్నాడతడు. -

మామయ్య నా చెవిలో గుసగుసగా చెప్పాడు -

"చూశావా వాడికెంత తెలివో..?! వీడికి అసలు ఎటువంటి ఫోనూ రాలేదు. నా ఎదురుగా షో చేయడానికి లోపల్నుంచి రింగ్ ఇప్పించాడు!" అని.

'అమ్మ మామయ్యా... నీకు ఇన్ని టక్కుటమారా విద్యలు తెలుసు కాబట్టే నువ్వు రాజకీయాల్లో వున్నావ్!' అనుకోసాగాను.

"అదిసరేలే గానీ, పోయినసారి వచ్చిన జనం మరీ అన్యాయమయ్యా! మా నాయకుడు మాట్లాడేటప్పుడు ప్రతి ఐదు నిముషాలకు చప్పట్లు కొట్టాలని చెప్పాను. కానీ, ఎవరూ చప్పట్లు కొట్టనేలేదు సరికదా- అందరూ మిఠాయిలూ, పల్లీలూ తెచ్చుకుని సభ జరుగుతున్నంతసేపూ అవి తినడమే సరిపోయింది. కొంతమంది జనమైతే హాయిగా నిద్రపోయారనుకో! ఈసారి జనాన్ని తప్పకుండా మార్చండి!" అన్నాడు.

అందుకు అతను వెంటనే- "సారూ... ఈసారి అలా జరగదులెండి! పార్టీ సభలకు జనాన్ని పంపేముందు మా స్పాట్‌కి పిలిపించి, అక్కడ ఎలా ప్రవర్తించాలో అందరికీ చక్కగా ట్రైనింగ్ ఇస్తున్నాం!" అన్నాడు.

"అయితే ఓ.కే.! మీకు చదువుకున్న కుర్రాడి అవసరం వుందా? మావాడు చదువుకున్నాడు. మీకు చాలా బాగా ఉపయోగపడతాడు..." అన్నాడు మామయ్య నన్ను చూపించి.

"అవసరముంది సారూ! కాని, మావాళ్ళు జనం దగ్గర కమీషన్ గుంజుకుంటున్నారు."

అతని మాటలకు అడ్డువచ్చి నేను వెంటనే "నన్ను మీ దగ్గర పెట్టుకోండి సర్! మీ డబ్బు ప్రతి రూపాయితో సహా జమాఖర్చులు చెప్తాను!" అన్నాను.

బాణాకఱ్ఱలు పట్టుకున్న వ్యక్తులు నన్ను నమిలేసేట్లుగా చూస్తున్నారు. ఆ చూపులో అర్థం- 'నీ పని అయిపోయిందిరా మా చేతుల్లో!' అన్నట్లుంది. నాకు చాలా భయంవేసింది. అక్కణ్ణుంచి లేచి పరుగు పరుగున పారిపోదా మనుకున్నాను.

"అలాగలాగే! మేము జనాన్ని ఇక్కడికి తీసుకురాగానే వాళ్ళందరికీ ఎప్పుడు చప్పట్లు కొట్టాలీ, ఎప్పుడు జై కొట్టాలీ, ఎప్పుడు జిందాబాద్ అనాలీ, ఎప్పుడు నాయకుల కాళ్లమీద పడాలీ... ఇలాంటివన్నీ మీరు ట్రైనింగ్ ఇవ్వాలి. సభ ఇంకా వారంరోజులు ఉందనగా ఈ తతంగం పూర్తయిపోవాలి!" అన్నాడతను.

"ఏయే ఊళ్ల నుండి తీసుకువస్తారు జనాన్ని?" అని అడిగాడు మామయ్య.

"మేము ఎక్కువ ఊళ్లు తిరిగే అవసరం లేకుండా పది, అంతకన్నా ఎక్కువ సభ్యులు ఉన్న ఉమ్మడి కుటుంబాల్ని ఎన్నుకుంటాం. వాళ్ళని మేం ఎప్పుడు పిలిస్తే అప్పుడు రెడీగా వుండమని చెప్తాం. వాళ్ళు లారీ ఎక్కినప్పటి నుండి సభ అయిపోయాక వాళ్ళందరినీ ఇళ్ల దగ్గర దింపేవరకూ బాధ్యత మాదే! ఎలాగూ వాళ్ళ తిండీతిప్పలు సభకు రప్పించుకున్న రాజకీయ పార్టీ పెట్టుకుంటుందనుకోండి. ఇకపోతే ధర్నాలకు, నిరసన ప్రదర్శనలకు మేము జనాల్ని సప్లయ్ చేయమనుకోండి. ఐతే మీ పార్టీ ఏమిటండీ?" అనడిగాడు.

"అదేం ప్రశ్నయ్యా?" అన్నాడు మామయ్య.

"సారూ... మీకు ఒక కొత్త విషయం చెప్పాలి. మేము ఒక కొత్త కాన్సెప్ట్‌తో టీమ్‌ని తయారుచేశాం. మీకు అపోజిషన్ పార్టీవారు మీటింగ్‌ని పాడుచెయ్యాలంటే జనాన్ని రెడీ చేస్తాం. ఈ టీమ్‌ని మేము సప్లయ్ చేసిన జనంతో పాటు కలిపేస్తాం. జనానికి డబ్బులిచ్చిన రాజకీయపార్టీ మీటింగ్‌కే, వాళ్ళ మీటింగ్‌ని పాడుచేయడానికి వాళ్ళ అపోజిషన్ పార్టీ నుండి కూడా డబ్బులు తీసుకుని ఈ టీమ్‌లో కలిపేస్తాం. మీటింగ్ ఏవడు పాడుచేశాడో ఎవరికీ తెలీదు."

అతని మాటలకు మామయ్య మధ్యలోనే అడ్డువచ్చి-

"ఇదీ బాగానే వుంది. దీని సిగతరగా... సభలు పెట్టి హైరానా పడేకన్నా అపోజిషనోళ్ళ సభలు పాడుచేస్తే పోలా! అదిసరే గాని, అలాంటి టీమ్‌ని గాని మా సభ జనంలో కలపకండి సుమా!" అన్నాడు

వాడు షాక్ తిన్నాడు. "అలాంటివి జరగవులెండి. ఇంతకీ మన ప్రోగ్రాం ఏమిటి?"

"మంత్రిగారు సభలోకి రాగానే జైకొట్టాలి. ఆయనకు సన్మానం జరుగుతున్నంతసేపూ చప్పట్లు కొడుతూనే వుండాలి. కొంతమంది ఆడాళ్ళు, ఆయన కాళ్లకు దణ్ణం పెట్టాలి. మేము ఇచ్చే గజమాల కొంతమంది మోసుకెళ్లి మంత్రిగారి మెడలో వెయ్యాలి. ఇక, అపోజిషన్ వాళ్ళ పేర్లు చెప్తాం. సభలో మధ్యమధ్యలో వాళ్ళ పేర్లు చెప్పి 'ముర్దాబాద్' అంటూ వుండాలి. మంత్రిగారు మాట్లాడుతున్నంతసేపూ ప్రతి అయిదు నిముషాలకూ చప్పట్లు కొట్టాలి. మరో ముఖ్య విషయం... నేను మాట్లాడుతున్నంతసేపూ చప్పట్లు కొట్టాలి. జనం రాగానే కాఫీ, టిఫిన్లు పెట్టిస్తాం. మంత్రిగారి మీటింగ్ అయ్యాక అక్కడే భోజనాలేర్పాటు చేస్తాం.

జనాన్ని జాగ్రత్తగా ఉండమనండి. పోయినసారి మీటింగ్‌లో మా నాయకుల పేర్లు చెప్పి 'జిందాబాద్' అనమంటే, 'ముర్దాబాద్' అని అరిచారు. చాలా గోలైపోయింది. చచ్చాను సర్దుకోడానికి! మంత్రిగారి మీటింగాయె ఇది... ఏదైనా తేడా వచ్చిందంటే నా పని గోవిందా! నేను రాబోయే మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి కోసం ట్రై చేస్తున్నాను. జాగ్రత్త సుమా!" అని వివరించాడు మామయ్య.

"సారూ... ఐతే మీవాడికి ఈ మీటింగ్ నుంచే మంచి ఉద్యోగం ఇచ్చేస్తున్నా! మీవాడే స్టేజీపక్కన నిలబడి జనం ఎప్పుడు ఏం చేయాలో సైగలు చేసి వాళ్ళచేత చేయిస్తాడు. అప్పుడు మీకు మాట రాదు. మాక్కూడా సేఫ్‌గా వుంటుందనుకోండి. మీకు మంత్రిపదవి వస్తే మాత్రం మమ్మల్ని మర్చిపోకండి సారూ!" అన్నాడతను.

"అలాగే... ఇదిగో!" అంటూ ఐదొందల నోట్ల కట్టలు ఇచ్చాడతనికి మామయ్య.

వెంటనే మామయ్య నావైపు చూసి కన్నుగొడుతూ "చూశావా... నీకు మంచి జాబ్ వచ్చేసింది! నెలకి ఒక మీటింగనుకో... పదివేలు వస్తాయి. రాజకీయం బాగా నడిచిందనుకో... నీకు పండుగే! ఇక ఎలక్షన్స్ వస్తే నువ్వు మహరాజువే!" అన్నాడు మామయ్య.

ఖద్దరు బట్టలేసుకుని, ఒక చేతిలో రెండు సెల్‌ఫోన్లు, మరో చేతిలో ట్రిబుల్ ఫైవ్ సిగరెట్ డబ్బా, చొక్కాజేబులో ఇంపోర్టెడ్ మెటల్ వైన్‌బాటిల్, ఖరీదైన రేబాన్ గ్లాసెస్ లోంచి లారీల్లో ఎక్కుతున్న జనాన్ని చూస్తున్న సీన్‌లోకి వెళ్లిపోయిన నేను- "పదవోయ్..!" అంటున్న మామయ్య మాటలకు ఈ లోకంలో కొచ్చాను.

జీపు ఎక్కాం ఇద్దరం. జీపు వేగంగా వెళ్లిపోతోంది.

నేను ప్రస్తుతం ఊహల్లో, మంత్రి అయిన మామయ్యతో జెట్ విమానంలో ప్రయాణిస్తూ ఎయిర్‌హోస్టెస్ ఇస్తున్న డ్రింక్, స్నాక్స్ తింటున్నాను స్టైల్‌గా.

●

'స్వాతి' వారపత్రిక ... 26 అక్టోబర్' 2007 సంచికలో ప్రచురితం